క్లుప్తంగా

యువకులకు వాలీబాల్ కిట్ పంపిణీ



కిట్ అందజేస్తున్న ఎస్సై విజయ్‌కుమార్

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామంలో యువకులకు ఎస్సై విజయ్‌కుమార్ సోమవారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. యువత చదువుతో పాటు, ఆటల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. గ్రామస్తులు శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను తహసీల్దార్ సరిత సోమవారం ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి బండ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువును నర్సరీల్లో వినియోగించాలి



ఐనంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దహెగాం: డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేసి ఎరువును తయారు చేసి నర్సరీల్లో వినియోగించుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఐనం గ్రామంలో నర్సరీ, డంపింగ్ యార్డులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లోని నర్సరీలలో మొక్కలు పెంచి సంరక్షించుకోవాలని సూచించారు.

ఉపాధిహామీ డబ్బుల కోసం వినతి



వినతిపత్రం అందజేస్తున్న కౌటాగాం గ్రామస్తులు

వాంకిడి: ఉపాధిహామీ పనులకు వెళ్లి 8 నెలలు కావస్తున్నా కూలీ డబ్బులు జమ కాలేదని సోమవారం తిర్యాణి మండలంలోని కౌటాగాం గ్రామానికి చెందిన కూలీలు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధిహామీ అధికారుల సూచనల మేరకు నూతన పోస్ట్ పేమెంట్ అకౌంట్ తీసుకున్నప్పటికీ డబ్బులు జమవ్వడం లేదని, తమ ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామ పటేల్ చిన్ను, ఉప సర్పంచ్ భీంరావు, అమృత్‌రావు తదితరులు ఉన్నారు.

చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల నోడల్ అధికారి జి.హన్మంతు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదవడం, రాయడం, మాట్లాడడం వంటి విషయాల్లో ముందుండేలా చూడాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు మార్త రమేష్, నానాజీ, సీఆర్పీలు ప్రకాశ్, రవికుమార్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన కట్టకోల రాజయ్యపై దాడి చేసిన అల్లకొండ సంతోష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

దారి కష్టాలు తీర్చేదెవరు?

- చిత్తడిగా మారుతున్న ఎల్లారం పోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు
- సాగునీరు పారుతుండడంతో బురదమయం
- అవస్థలు పడుతున్న రైతులు, భక్తులు



పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో బురద

బెజ్జూర్: సాధారణంగా వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. కానీ మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామ శివారులో గల ఎల్లారం పోచమ్మ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు కాలమేదైనా బురదమయంగానే ఉంటుంది. ఆ రోడ్డు గుండా ఆలయానికి వెళ్లే భక్తులతో పాటు పంట పొలాలకు వెళ్లే రైతన్నలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

చిత్తడిగా మారుతున్న రోడ్డు..

మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామ శివారులోని ఎల్లారం పోచమ్మ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు బురదమయంగా మారుతోంది. ఈ రోడ్డు గుండా పంట పొలాలకు వెళ్లే రైతులు కనీసం ఎడ్లబండ్లు తీసుకెళ్లలేని దుస్థితి నెలకొంటుంది. వర్షాకాలంలోనైతే కనీసం నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. మట్టి రోడ్డు కావడంతో పూర్తిగా చిత్తడిగా మారుతోంది. మత్తడి మైసమ్మ నుంచి కాల్వల ద్వారా పంట పొలాలకు సాగు నీరు అందిస్తున్నారు. పంట పొలాలు ఎత్తు ప్రదేశంలో ఉండడం, రోడ్డు కింది భాగంలో ఉండడతో పంట పొలాలకు అందిస్తున్న నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో కాలంతో సంబంధం లేకుండా ప్రతినిత్యం రోడ్డుపై నీరు చేరి బురదమయంగా మారుతోంది. బెజ్జూర్, ఎలుకపెల్లి, చిన్నసిద్దాపూర్ గ్రామాల నుంచి ప్రతిరోజు రైతులు, భక్తులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. బురదమయంగా రోడ్డు ఉండడంతో ఎడ్లబండ్లు, వివిధ వాహనాలు రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్డు ఎత్తును పెంచి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు, భక్తులు అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

రోడ్డు బాగు చేయాలి



గ్రామ శివారులోని ఎల్లారం పోచమ్మ టెంపుల్‌కు వెళ్లే రోడ్డు ప్రతినిత్యం చిత్తడిగా మారుతుంది. ఈ రోడ్డు గుండా పంట పొలాలకు వెళ్తుంటాం. మరోవైపు ఈ రోడ్డు గుండానే వందలాది మంది భక్తులు పోచమ్మ ఆలయానికి వెళ్తారు. దీంతో అవస్థలు ఎదురవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డు బాగు చేయించాలి.

\- టాకిరే శ్రీకాంత్, చిన్నసిద్దాపూర్

ఇబ్బంది పడుతున్నాం



కాలువ ద్వారా పంట చేలకు అందించే నీరు రోడ్డుపైకి చేరుతుండడంతో బురదమయంగా మారుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డు గుండా ఓ వాగు ఉంది. వర్షాకాలంలో కనీసం కాలినడకన కూడా దాటే పరిస్థితి ఉండదు. ఈ రోడ్డు వెంబడి నిత్యం రైతులు, భక్తులు వెళ్తుంటారు. రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలి.

\- చౌదరి కృష్ణ, చిన్నసిద్దాపూర్

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా మూలమలుపులు
- కానరాని సూచిక బోర్డులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



మొర్రిగూడ పంచాయతీ పరిధిలోని ఘాట్ సెక్షన్ వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

తిర్యాణి: మండల కేంద్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు మంచిర్యాల జిల్లాలోని ఐబీ, తాండూర్, బెల్లంపెల్లి, మంచిర్యాల పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రం నుంచి మంచిర్యాలకు వెళ్లే దారిలోని ఘాట్ సెక్షన్‌లో ప్రమాదకరమైన మూలమలుపులు ఉండటంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

కానరాని సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు..

మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఘాట్ సెక్షన్‌లో ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద అధికారులు ఎటువంటి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కడ మూలమలుపు ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఇటీవల మండల కేంద్రం నుంచి మంచిర్యాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు మొర్రిగూడ పంచాయతీ పరిధిలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇలా ఘాట్ సెక్షన్‌లోని మూలమలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక సూచిక బోర్డులతో పాటు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రం నుంచి ఐబీ వైపునకు వెళ్లే దారిలో ఉన్న మూలమలుపుల వద్ద వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రి సమయంలో ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

\- పులి వెంకటేశ్, తిర్యాణి

చర్యలు తీసుకోవాలి



ఐబీ (తాండూర్) మీదుగా కొత్తగా మండల కేంద్రానికి వచ్చే వాహనదారులు మూలమలుపుల మీదుగా ప్రయాణించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల వద్ద వాహనాల వేగం నిరోధించడానికి అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

\- గట్టయ్య, నాయకపుగూడ

క్రీడల్లో గెలుపోటములు సహజం



బెజ్జూర్: ట్రోఫీ అందజేస్తున్న కోనప్ప



కౌటాలలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెజ్జూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని గెర్రుగూడ గ్రామంలో కుమురంభీం స్మారకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి సోమవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటి బహుమతి చింతలమానెపల్లి గ్రామ జట్టు కైవసం చేసుకోగా, గెర్రుగూడ గ్రామానికి చెందిన జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఎమ్మెల్యే విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభం

కౌటాల: మండల కేంద్రంలో శ్రీ సత్యసాయి సేవ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గంలో నడవాలన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని వ్యాపారులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు చంద్రశేఖర్, ప్రభాకర్, సంతోష్, మల్లేష్, శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ గాదినేని మల్లేశ్

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం అధ్యక్షతన కొనసాగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ గాదేనేని మల్లేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కెరమెరి మార్కెట్ యార్డుకు ప్రహరీ నిర్మాణం, బోర్‌వెల్, విద్యుత్ సౌకర్యంతో పాటు నేలపై ఫ్లోరింగ్ కోసం రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

సభా దృష్టికి సమస్యలు..

కెరమెరి బెస్తవాడలో రెండు స్తంభాలు వేయాలని, వ్యవసాయదారులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడం లేదని ఎంపీటీసీ ఇస్తేకార్ అహ్మద్ సభ దృష్టికి తీసుకొచ్చారు. కెరమెరి ప్రాథమిక పాఠశాలను బీసీ హాస్టల్లో చేర్చాలని ఆయన కోరగా సమావేశంలో తీర్మానం చేశారు. ఐటీడీఏ ఏఈ నజీమోద్దిన్ మాట్లాడుతూ మండలంలోని ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, కర్నెతగూడ వాగుపై వంతెన మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. మండలంలో 12 మందికి రైతుబీమా మంజూరైందని వ్యవసాయాధికారి గోపీకాంత్ పేర్కొన్నారు. ధనోరా గ్రామంలో కొంత మందికి మాత్రమే మిషన్ భగీరథ నీరు వస్తుందని జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా అందరికి నీరు వచ్చేలా చేస్తామన్నారు. కంటి వెలుగులో భాగంగా 746 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యాధికారి వెంకటేశ్ తెలిపారు. ముకదంగూడ అంగన్‌వాడీ కేంద్రానికి ఐదేళ్లుగా అంగన్‌వాడీ వర్కర్ రావడం లేదని, సరుకులు సైతం అనార్‌పల్లిలో అన్‌లోడ్ చేస్తున్నారని ముకదంగూడ సర్పంచ్ లింబాదాస్ మండిపడ్డారు. ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక్కటి చొప్పున చౌకధరల దుకాణం మంజూరు చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెందోర్ రాము కుటుంబాన్ని ఆదుకుంటాం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సక్కు

కెరమెరి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్‌ఎస్ నేత పెందోర్ రాము కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఆదివారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాము చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచ్ కన్నిబాయి, జగన్నాథ్, న్యానేశ్వర్, మోహన్‌రావు, రాజేశ్వర్, భీంరావు, భరత్, తదితరులు ఉన్నారు.

అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

నార్నూర్: గాదిగూడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అడ చంద్రకళ రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది ఉపాధ్యాయులు జనవరి 26న జాతీయ జెండా ఆవిష్కరించలేదని సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈవో రాపల్లి ఆశన్న పాఠశాలను ఎందుకు తనిఖీ చేయడం లేదని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా ఎంత మందికి వచ్చాయని ఏవో దివ్యను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని డీఈ శ్రీనివాస్‌ను సభ్యులు నిలదీశారు. లోద్దిగూడ, కుండి, పున్నగూడ, మారెగాం నుంచి కునికాసా, ఎంపల్లి నుంచి లోకారి, ధర్మగూడ నుంచి పర్సువాడ బీటీరోడ్డు పూర్తి చేయాలన్నారు. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. కంటివెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగుబాయి, వైస్ ఎంపీపీ యోగేశ్, ఎంపీడీవో సాయిప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్/చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని సిర్పూర్–టి, కౌటాల, బెజ్జూర్, దహెగాం, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్‌తో పాటు కాగజ్‌నగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో కాగజ్‌నగర్ పట్టణం మినహా మంగళవారం మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ రాజశేఖర్ తెలిపారు. 133 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన యంత్రాల ఏర్పాటును దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బౌద్ధ సమాజ్ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ

కౌటాల: మండల బౌద్ధ సమాజ్ నూతన కమిటీని సోమవారం స్థానిక బుద్ధ విహార్‌లో ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా బండురావు, ఉపాధ్యక్షులుగా శ్యాంరావ్, ఏమాజీ, యశ్వంత్, నోమాజీ, మారుతి, ప్రధాన కార్యదర్శిగా దేవాజీ, సంయుక్త కార్యదర్శులుగా విఠల్, ఆనంద్‌రావు, దేవిదాస్, కోశాధికారిగా సాయినాథ్, ప్రచార కార్యదర్శులుగా శంకర్, గణపతి, సోమయ్య, ప్రకాశ్, సంపత్, సలహాదారులుగా పుండలిక్, ఆగయ్య, ఆత్మరాం, వసంత్, మధుకర్, ప్రకాశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆటలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



ఆటలు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కెరమెరి: ఆటలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి అన్నారు. సోమవారం మండలంలోని సాంగ్వి గ్రామంలో జై హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఎస్సై వెంకటేశ్, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచ్ జగన్నాథ్‌రావు, న్యానేశ్వర్, ఎంపీటీసీ సకారాం, కుమురం భీంరావు, సిరాజ్, అంబరావు తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



సరుకులు పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆశ్రమ పాఠశాలల అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎం కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు ఏర్పాట్లు



నంబాలలో వివరాలు తెలుసుకుంటున్న డీజీఎం



గంగాపూర్‌లో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎస్సై భూమేష్

రెబ్బెన: మండలంలోని ప్రసిద్ధ నంబాల ప్రసన్న పరమేశ్వర ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే జాతరకు సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఆలయాన్ని వర్క్‌షాప్ డీజీఎం కృష్ణమూర్తి సందర్శించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే స్థలం, ముఖద్వారం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. రెండు రోజుల్లో సింగరేణి ఆధ్వర్యంలో తయారుచేసిన ముఖద్వారాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వీఐపీ దర్శనం కోసం మెట్లను ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, సర్పంచ్ చెన్న సోమశేఖర్ కోరారు. జాతర సమయానికి వీఐపీ దర్శనం ఏర్పాట్లు సైతం పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘశుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని ఫిబ్రవరి 4 నుంచి నిర్వహించే జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఎస్సై భూమేష్, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఎంపీటీసీ మధునయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాట్లు పరిశీలించారు.

మినీ మేడారం జాతర ఏర్పాట్ల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడ శివారులో నిర్వహించే మినీ మేడారం జాతర ఏర్పాట్లను కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియాలు సోమవారం పరిశీలించారు. ఫిబ్రవరి 1, 2, 3, 4వ తేదీల్లో నిర్వహించే జాతర సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్, కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, బొమ్మెల్ల వెంకటేశ్, పిర్సింగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ పట్టాదారుల పేర్లు తొలగించాలి'

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలోని దళితుల భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారి పేర్లు రికార్డుల నుంచి తొలగించాలని బాధితులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ టేకుమట్ల గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. వెంటనే అక్రమ పట్టాదారుల పేర్లు తొలగించి దళితులకు చెందేలా చూడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆసంపల్లి మల్లేష్, చిప్పకుర్తి సతీష్, రాజారావు, రాజం, లక్ష్మణ్ ఉన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

లక్సెట్టిపేట: ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐ న్యూ డెమొక్రసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ భారతీ హోళ్లికేరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎన్‌జీవోస్ కాలనీలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని, ఇళ్లు లేని పేదలకు అందించాలన్నారు. ఆ భూమి ఆక్రమణకు గురవుతుందని, కొంతమంది అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు.

బూత్ లెవల్ కమిటీలు ఏర్పాటు చేయాలి



ఓటర్‌లిస్ట్ అందజేస్తున్న లక్ష్మి

నార్నూర్(జైనూర్): బీజేపీ బూత్ లెవల్ మండల స్థాయి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ ఆసిఫాబాద్ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి అన్నారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలను ఏర్పాటు చేసి బూత్ కమిటీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన ఓటర్ లిస్ట్‌ను మండల ఇన్‌చార్జి మనోహర్‌కు అందించారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, జిల్లా నాయకుడు మాల్రాజ్, రాంబాబు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నార్నూర్: దేశ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యుసుఫ్‌ఖాన్ అన్నారు. సోమవారం భారత్‌జోడో యాత్ర ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కరెంట్ చార్జీలు, బస్సు చార్జీలు, ధరణి రిజిస్ట్రేషన్ పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. సత్తార్, తొడసం విష్ణు, రమేశ్, కార్తీక్ పాల్గొన్నారు.